## క్లుప్తంగా

### ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

పొన్నూరు: పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ప్లాస్టిక్ వినియోగం పెరిగి మురుగు కాలువల్లో అడ్డంకిగా మారిన వైనంపై పాలిథిన్ వ్యర్థాలతో అనర్థం శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పాత పోలీస్ స్టేషన్ ఆవరణతో పాటు పలు ప్రాంతాల్లో పేరుకున్న పాలిథిన్ వ్యర్థాలను తొలగించి సమస్యను పరిష్కరించారు.

### కళ్లం కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: విద్యార్థులతోపాటు అధ్యాపకుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడు కృషి చేస్తోందని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.వంశీకృష్ణకు విట్ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. అడ్వాన్స్‌డ్ ఐపీడీఎస్ ఫార్మ్‌వర్క్స్ ఫర్ ఎన్‌హెసింగ్ సొసైటీ అండ్ కమ్యూనికేషన్ ఇన్ హాస్టల్ వీనెట్స్ అనే అంశంపై విశ్వవిద్యాలయం డాక్టర్ కె.గణేష్‌రెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందని చెప్పారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ వి.రాజీవ్‌జట్సన్ అభినందించారు.

### నారాకోడూరులో చెకుముకి పోటీలు



చేబ్రోలు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ క్విజ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. చెకుముకి సైన్స్ సంబరాల కార్యక్రమానికి ఎంఈఓలు ఏహెచ్‌వీ ప్రసాద్, రాయల సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించటానికి ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను పోగొట్టటానికి జన విజ్ఞాన వేదిక విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్ పెంపొందించటానికి సైన్స్ సంబరాలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. చేబ్రోలు, నారాకోడూరు, వేజెండ్ల హైస్కూల్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ప్రథమస్థానంలో నిలిచిన వారు అక్టోబర్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. నారాకోడూరు హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు, హెచ్‌ఎంలు ఎస్‌ఎస్ రావు, విశ్వేశ్వరరావు, కోటి పద్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

### ఫీల్డ్‌కు వెళ్లండి.. సర్వే చేయండి

జిల్లా మలేరియా అధికారి టీఎం సుబ్బరాయన్



ప్రత్తిపాడు: ఆరోగ్య సిబ్బంది ఫీల్డ్‌కి వెళ్లి ఇంటింటి సర్వే చేయాలని జిల్లా మలేరియా అధికారి టీఎం సుబ్బరాయన్ అన్నారు. ప్రత్తిపాడులో చిన్నారులు దద్దుర్ల బారిన పడుతున్నారంటూ ఇటీవల 'సాక్షి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా మలేరియా అధికారి టీఎం సుబ్బరాయన్ తన సిబ్బందితో కలిసి ప్రత్తిపాడులో పర్యటించారు. స్థానిక సబ్‌సెంటరుకు వెళ్లి జ్వరాలు, చర్మ వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలను దద్దుర్లు, జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని, దద్దుర్లు బారిన పడిన వారి రక్తనమూనాలు సేకరించాలని ఆదేశించారు. సీహెచ్‌ఓ స్వర్ణలత ఉన్నారు.

### జొన్నలగడ్డలో రైతు సదస్సు

గుంటూరు రూరల్: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సకాలంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించి పంటలను రక్షించుకుని మంచి దిగుబడులు పొందాలని లాంఫాం వ్యవసాయ పరిశోధనా స్థానం కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.యుగంధర్ తెలిపారు. మంగళవారం జొన్నలగడ్డ గ్రామంలో వ్యవసాయ విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. యుగంధర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అదే విధంగా వ్యవసాయ విద్యార్థులు రైతులతో పాటు వ్యవసాయ అనుభవాలను తెలుసుకుని క్షేత్రస్థాయిలో సేంద్రియ వ్యవసాయం దిశగా రైతులను ముందుకు నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి, ఉత్తమ రైతులు వంగా నవీన్‌రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# బందెలదొడ్డిలో కాలం వెళ్లదీస్తున్నాయి..

- వెంగళాయపాలెం దొడ్డిలో అధ్వాన పరిస్థితులు
- తిండిలేక బక్కచిక్కి పోతున్న గోవులు
- ఎండుగడ్డే శరణ్యమైన పరిస్థితులు
- కనీస వసతులు లేక బురదలో బతుకుతున్న గోవులు



చిత్తడిగా ఉన్న నేలతో పడుకోలేక నిలబడే ఉన్న గోవులు



కనీసం మేతలేక బురదలో ఎండుగడ్డి తింటున్న గోవులు

గుంటూరు రూరల్: బందెలదొడ్డిలో కనీస వసతులు లేక గోవులు అవస్థలు పడుతున్నాయి. సరిగ్గా మేత కూడా అందడం లేదు. దీంతో అక్కడ ఉన్న ఆవులు చిక్కిశల్యమవుతున్నాయి. వివరాలు.. నగరంలో విచ్చల విడిగా వదులుతున్న గోవుల తరలించేందుకు వెంగళాయపాలెంలో బందెలదొడ్డిని కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. నగరంలో స్వాధీనం చేసుకున్న గోవులతో పాటు అక్రమంగా తరలిస్తున్న గోవులను అక్కడ తరలిస్తుంటారు. గతంలో 300 వరకు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం 30 వరకు ఉన్నాయి. వాటి సంరక్షణ అస్తవ్యస్తంగా ఉండడంతో గోవులు ఈరోజా..రేపా..అన్నట్లు కాలం వెళ్లదీస్తున్నాయి. వర్షాలకు గోశాల బురదమయంగా మారింది. కనీసం కాలు కదపలేని పరిస్థితిలోనే వాటిని అక్కడే ఉంచుతున్నారు. సమయానికి తిండిలేక ఎండుగడ్డితోనే సరిపుచ్చుతున్నారు. వర్షం పడి చిత్తడిమయమైన బురదలో పడుకోలేక నిలబడలేక నరకం చూస్తున్నాయి. సమయానికి నీరు, మేత అందించడంలో అక్కడ సిబ్బంది శ్రద్ధ చూపడంలేదు. ఇదేవిధంగా అక్కడ ఎన్ని గోవులున్నాయి. ఎన్ని వస్తున్నాయి.. వసతులు లేక ఎన్ని మృత్యువాతకు గురవుతున్నాయి పట్టించుకునే నాథుడు లేడని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రశాంతంగా ఆరు బయట తిరిగే ఆవులను తెచ్చి నరకంలో పడేశారని, కనీసం పట్టించుకోకుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న గోవులను తెచ్చి ఇక్కడ వదిలి వెళుతున్నారని ప్రయాణాల్లో వాహనాల్లో కుక్కి తరలించే క్రమంలో గాయాలపాలైన గోవులకు కనీసం వైద్య సౌకర్యాలు లేకుండా ఇక్కడ వదిలేస్తుండటంతో రోజుల వ్యవధిలోనే ప్రాణాలుకోల్పోతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. కనీసం బందెలదొడ్డిలో సౌకర్యాలు కల్పించి గోవుల ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

**అధికారులు ఏమన్నారంటే...**

గత కొన్ని సంవత్సరాల క్రితం నగరంలో రోడ్లపై ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్న గోవులను ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేందుకు వెంగళాయపాలెంలోని నగర మున్సిపల్ కార్పొరేషన్ స్థలంలో బందెలదొడ్డిని ఏర్పాటు చేసి అందులోకి తరలించి వాటిని పరిరక్షిస్తున్నాం. దీనికి తోడు పలు గోసంరక్షణ సంస్థలు, పోలీసులు అక్రమంగా తరలిస్తున్న గోవులను పట్టుకుని వందల సంఖ్యలో గోవులను ఇక్కడికి తరలించటంతో బందెల దొడ్డిలో స్థలం సరిపోక గోవులు ఇబ్బందులు పడుతున్నాయి. సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళాం. వాటి పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.

-ఆనంద్‌కుమార్, ఎంహెచ్‌ఓ, నగర కార్పొరేషన్

## సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు, గ్రామాల్లో ప్రజా సమస్యలపై నియోజకవర్గం నాయకులతో చర్చించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు కార్యాచరణ, ప్రణాళికలపై నేతలతో మాట్లాడారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరం సమష్టిగా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీలు.. బాధ్యతలు



సబ్ రిజిస్ట్రార్ పర్వీన్ బాబి



టీపీఎస్ పూసుకూరి రాఘవరావు



ఎక్సైజ్ సీఐ ఎం. రమేష్

పొన్నూరు: సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన పలువురు అధికారులు తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు.

- పొన్నూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐగా ఎం.రమేష్, ఎస్‌ఐగా శివరామ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సెబ్ సీఐగా పనిచేసిన సుకన్య చీమకుర్తి బదిలీ అయ్యారు.
- సబ్ రిజిస్ట్రార్‌గా షేక్ పర్వీన్ బాబి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కొల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. పొన్నూరులో ఇప్పటి వరకు పనిచేసిన చక్రవర్తి చేబ్రోలుకు బదిలీ అయ్యారు.
- మున్సిపల్ టీపీఎస్‌గా పూసుకూరి రాఘవరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో పనిచేసి బదిలీపై పొన్నూరుకు వచ్చారు.
- పొన్నూరు ఎంపీడీఓ శ్రీనివాసరావు దుగ్గిరాల మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన ప్రస్తుతం భట్టిప్రోలు ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## వరికి రెండు సార్లు పొటాష్ ఎరువు వాడాలి

పెదకాకానిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



రైతులతో కలసి వరిపైరును పరిశీలిస్తున్న ఏఓ సంధ్యారాణి

పెదకాకాని: వరి పంటకు ఎకరానికి 25 కిలోలు చొప్పున పంటకాలంలో రెండు సార్లు వేయడం వలన పంట రోగనిరోధక శక్తి పెరిగి చీడపీడలను తట్టుకునే శక్తి వస్తుందని మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి అన్నారు. పెదకాకానిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తొలుత రైతులతో కలసి వ్యవసాయ అధికారి వరి పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఓ మాట్లాడుతూ వరి పైరుకు పొటాష్ వాడటం వలన ధాన్యం మంచి రంగు రావడంతో పాటు దిగుబడి పెరుగుతుందన్నారు. ఉద్యాన శాఖ అధికారిణి కె.దీపికా మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా తీగ జాతి పంటలు చిక్కుడు, దొండ, బీర వంటి పందిరి సాగు చేసే రైతులకు విత్తనాలు, పందిళ్లకు రాయితీ కల్పించడం జరుగుతుందని చెప్పారు. కావాల్సిన రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రెడ్డి శివాజీ, వీఏఏలు వి.లక్ష్మీతిరుపతమ్మ, ఎస్‌కే షాహినా పాల్గొన్నారు.

## మలినేనిలో ముగిసిన హ్యాకథాన్

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ తృతీయ సంవత్సరం విద్యార్థినులకు మేక్ స్కిల్డ్ కంపెనీ ఆధ్వర్యంలో ఏఐ, ఐవోటీపై నిర్వహించిన 36 గంటల హ్యాకథాన్ మంగళవారం ముగిసింది. విద్యార్థినులకు ఆంధ్రా ఏంజెల్స్ నెట్‌వర్క్ ఫౌండర్ షేక్‌రీనా బేగం, మేక్ స్కిల్డ్ సీఈఓ పి.మధు హాజరై సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు, ప్రిన్సిపాల్ అప్పారావు పాల్గొన్నారు.

## హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ రంగంలో కమ్యూనికేషన్స్ స్కిల్స్ కీలకం

ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరూపరాణి



ఏఎన్‌యూ: హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ రంగంలో కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో కీలకమని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి అన్నారు. ఏఎన్‌యూ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో 'ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఫర్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్' అనే అంశంపై మంగళవారం నిర్వహించిన గెస్ట్ లెక్చర్‌కు ఆచార్య స్వరూపరాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె ప్రసంగిస్తూ రోగులతో, వైద్య రంగ నిపుణులతో సంభాషించడానికి హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ నిపుణులకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమన్నారు. ప్రస్తుతం ఈ కోర్సు చదివిన వారికి మంచి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని వాటిని అందిపుచ్చుకునే నైపుణ్య లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ ప్రొఫెసర్ ఎ.చంద్రమోహన్ ప్రసంగిస్తూ హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్‌కి కమ్యూనికేషన్ స్కిల్స్ అత్యవసరమని కమ్యూనికేషన్‌లో కీలక అంశాలైన వినడం, రాయడం, చదవడం, పరిపూర్ణంగా భావ వ్యక్తీకరణ చేయడం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు సబ్జెక్టులకు సంబంధించిన అంశాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. నైపుణ్యం ఉంటేనే హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ రంగంలో రాణించగలుగుతారన్నారు. విభాగాధిపతి డాక్టర్ బి.నాగరాజు, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివవాసరావు, డాక్టర్ డేవిడ్ రాజు, డాక్టర్ సాదిక్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

### నేడు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు పునఃప్రారంభం

ప్రత్తిపాడు: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని కోయవారిపాలెం, తిమ్మాపురం, గనికపుడి గ్రామాల్లో అక్టోబర్ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు పునఃప్రారంభిస్తున్నట్లు ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ షేక్ ఖాజా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా పెదగొట్టిపాడులో క్లాప్ మిత్రలను సన్మానించడంతో పాటు, యనమదలలో శ్రమదానం నిర్వహించడం జరుగుతుందని ఖాజా తెలిపారు.

### చిరుధాన్యాల వంటకాలతో రుచి, ఆరోగ్యం

గుంటూరు రూరల్: సంప్రదాయకమైన చిరుధాన్యాల పంటలతో వంటకాలు ఎంతో రుచిగా మంచి ఆరోగ్యాన్ని అందిస్తాయని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో రైతునేస్తం ఫౌండేషన్‌లో చిరుధాన్యాల వంటకాలపై రైతు, మహిళలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రకాల కారణాల వలన మన సంప్రదాయ ఆహారాలు చిరుధాన్యాలను పక్కనపెట్టి వరి, గోధుములు మన ఆహారంలో ప్రధాన భాగంగా చేసుకున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. చిరుధాన్యాలతో పోల్చుకుంటే వరి, గోధుములలో పోషకాలు తక్కువగా ఉంటాయన్నారు. మనం ఆరోగ్యంగా జీవించటానికి అవసరమైన పోషకాలు చిరుధాన్యాలలోనే సమపాళ్ళలో ఉంటాయని వివరించారు. చిరుధాన్యాల నిపుణులు మిల్లెట్ రాంబాబు మాట్లాడారు.

### నేడు ఉపాధి హామీ గ్రామ సభలు

చేబ్రోలు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా బుధవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.లలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేబర్ బడ్జెట్ ప్రణాళిక తయారు చేయటం కోసం, వర్కులు, గుర్తించిన పనులను గ్రామ సర్పంచి అధ్యక్షతన జరిగే గ్రామ సభల్లో తెలియజేయనున్నారు. 13 గ్రామ పంచాయతీల పరిధిలో జరిగే గ్రామ సభలకు ఏపీఓ కె.ఆనంద్, టీఏలు ఎస్.సంపత్, ఎస్.రసూల్, జేఈ డి.బాజి హాజరుకానున్నట్లు చెప్పారు.

### చేబ్రోలు మండలంలో 97 శాతం పెన్షన్లు పంపిణీ

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం 97శాతం పూర్తి అయినట్లు మండలాధికారులు మంగళవారం తెలిపారు. చేబ్రోలు మండలంలోని 17గ్రామ సచివాలయాల పరిధిలో 10,229మంది పెన్షన్‌దారులు ఉన్నారు. 9840 మందికి సచివాలయ సిబ్బంది అందజేశారు.

## కిట్స్‌లో రోడ్ మ్యాప్ టూ టాప్ ఎంఎన్‌సీలపై వర్క్ షాప్

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ కళాశాలలో రోడ్ మ్యాప్ టూ టాప్ ఎంఎన్‌సీ మరియు రెజ్యూమ్ తయారీలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రస్తుత టెక్నాలజీని ఉపయోగించుకొని టాప్ ఎంఎన్‌సీల్లో ఉద్యోగాలను ఎలా సాధించాలన్న దానిపై ఐటీ, సీఎస్‌సీ మూడో సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ పంకజ్ వివరించారు. సాఫ్ట్ వేర్ రంగంలో సర్వీస్, ప్రొడక్టు ఆధారిత విభాగాల్లో ఉద్యోగ అవకాశాలుంటాయని చెప్పారు. ఉద్యోగం సాధించడానికి ఓపెన్ ప్లాట్ ఫాం కోడింగ్ స్కిల్స్‌ను విద్యార్థులు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఇందుకోసం లింక్డ్ఇన్ మరియు గిట్‌హబ్ లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను వినియోగించుకోవాలని చెప్పారు. కళాశాలల్లో జరిగే హ్యాకథాన్లు, ఐడియాథాన్లు, కోడ్‌థాన్లలో పాల్గొనడం వలన ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు టెక్నికల్ స్కిల్స్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్ కూడా సాధించడం ద్వారా ఉద్యోగాలు సులభంగా సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎంఎస్ఎస్ సాయి పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా ముగిసిన పవిత్రోత్సవాలు



పెదకాకాని శివాలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా ఆలయ ప్రదక్షిణ చేస్తున్న డీసీ లీలాకుమార్

పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాలలో భాగంగా చివరి రోజు మంగళవారం ఉదయం విశేష సంధి, ద్వితీయ కాలయాగశాల పూజ, అవభృదయాగం, చతుర్వేదపారాయణలు, మహాపూర్ణాహుతి, యాత్రాదానం, కలశాభిషేకం, అలంకార పూజలు చేశారు. పరివార దేవతా పవిత్ర సమర్పణ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామికి విశేష వ్రత చరితపూజ, శైవాగమ పద్ధతిన పవిత్ర సమర్పణ క్రతువును ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చక పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్, ఉపప్రధాన అర్చకులు చదలవాడ జాలయ్య, పేటేటి ధనమహేశ్వరప్రసాద్, అర్చకులు, వేదపండితులు నిర్వహించారు. స్వామి మూల మంత్ర తత్వార్చన, మంత్ర పుష్పం, హారతి, విభూతి, కుంకుమ ప్రసాదాలు పంపిణీ చేశారు. పవిత్రోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ పర్యవేక్షణలో భ్రమరాంబ మల్లేశ్వర స్వామిని అత్యంత సుందరంగా పూలతో తయారు చేసిన ప్రత్యేక వాహనంపై అలంకరించి పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులను దర్శించుకుని పూజా సామగ్రి సమర్పించారు.పవిత్రోత్సవాల నిర్వహణ దాతలైన తెనాలికి చెందిన రెడ్డి నవీన్‌కుమార్, విజయలక్ష్మీ దంపతులు, నీలివెల్లి కోటేశ్వరి కుటుంబ సభ్యులకు దేవస్థానం అర్చకులు, వేదపండితులు వేద ఆశీర్వదం అందించారు. ఆలయ ఉపకమిషనరు స్వామి వారి శేష వస్త్రాంతో దాతలను సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

## ఇంటింటికీ కాదు.. వీధి చివర..!



పెదనందిపాడులో లబ్ధిదారులను పోగు చేసి అక్కడే ఫొటోలు తీసి పింఛన్లు ఇస్తున్న సచివాలయ ఉద్యోగి



పొన్నూరు పట్టణంలో లబ్ధిదారునికి పింఛన్ అందిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

ప్రత్తిపాడు: వలంటీర్లు లేకుండా పింఛన్లు పంపిణీ చేయలేమన్నారు. కానీ ఉద్యోగులతోనే ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇళ్ల వద్దనే 90 శాతం పింఛన్లు పంపిణీ చేస్తున్నాం.. పొద్దు పొడిచిన నుంచి పొద్దు పోయే వరకు వేదిక దొరికిన ప్రతిసారీ పింఛన్ల పంపిణీపై కూటమి నేతలు పలికే ప్రగల్భాలు ఇవి. కానీ క్షేత్ర స్థాయిలో కొన్ని ప్రాంతాల్లో వాస్తవ పరిస్థితులు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేయాల్సిన సిబ్బంది డోర్ టు డోర్ వెళ్లకుండా, వీధి చివరనో, ఎవరో ఒకరి ఇంటి వద్దనో కూర్చుని పింఛన్లను పంపిణీ చేస్తున్నారు. అందుకు దర్పణమే ఈ చిత్రం. పెదనందిపాడులోని ఓ సచివాలయ ఉద్యోగి ఇదిగో ఇలా వీధి చివరి ఒక చోటకు వెళ్లి, అక్కడికే అందరినీ పోగుచేసి పింఛన్లుకు ఫొటోలు తీసుకుంటున్నాడు. చూసినవారంతా ఇదేంది సారూ.. చంద్రబాబు చెప్పేదానికి చేసేదానికి ఇంత తేడానా అంటూ పెదవి విరుస్తున్నారు.

**ఇంటి వద్దనే పింఛన్లు ఇవ్వాలి**

ప్రత్తిపాడు: లబ్ధిదారులకు వారి ఇంటి వద్దనే పింఛన్లు అందజేయాలని ఎంపీడీఓ కె.శివపార్వతి కోరారు. మండల పరిధిలోని కొత్తమల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం, నిమ్మగడ్డవారిపాలెం, కోయవారిపాలెం, కొండేపాడు గ్రామాల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీని మంగళవారం ఎంపీడీఓ శివపార్వతి పరిశీలించారు.

**పొన్నూరులో 98 శాతం పింఛన్ల పంపిణీ**

పొన్నూరు: మండల, పట్టణ పరిధిలోని వార్డులలో సచివాలయ ఉద్యోగులతో పాటు, కూటమి నాయకులు పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. పట్టణంలోని పలు వార్డులలో ఉదయం పింఛన్ల పంపిణీని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు పర్యవేక్షించారు. పట్టణంలో మొత్తం 31 వార్డులలోని 17 సచివాలయాల పరిధిలో 5,864 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా సాయంత్రం 5 గంటల వరకు 5,755 మందికి పంపిణీ చేసినట్లు మున్సిపల్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. 98.14 శాతం పూర్తయినట్లు పేర్కొన్నారు. మండల పరిధిలో 96 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తెలిపారు. మొత్తం 10,034 పింఛన్లు ఉండగా, వాటిలో 9,563 మందికి పింఛన్లు అందజేశారు.

## పోలింగ్ బూత్‌ల మార్పుకు ప్రతిపాదనలు

గుంటూరు ఆర్డీఓ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న గుంటూరు ఆర్డీఓ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని మూడు పోలింగ్ బూత్‌ల మార్పునకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు గుంటూరు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ గుంటూరురూరల్ మండలంలో 1500 ఓట్లు కన్నా అధికంగా ఉన్న 3, 5, 62 పోలింగ్ బూత్‌ల్లోని ఓటర్లను విభజించి అదనంగా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపుతున్నామని చెప్పారు. అదే విధంగా పెదనందిపాడులోని 230, 231 పోలింగ్ బూత్‌లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన భవనంలో ఉన్నాయని, వాటిని అదే ప్రాంగణంలోని నూతన భవనంలోనికి మారుస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేశామని వివరించారు. ఎవ్వరికైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్‌కు పంపడం జరుగుతుందని, కలెక్టర్ ఆమోదం తరువాత ఎన్నికల కమిషన్‌కు పంపిస్తామని చెప్పారు. ఓట్లు, పోలింగ్ స్టేషన్లకు సంబంధించి జరిగే ప్రతి చట్టబద్ధమైన కార్యక్రమాన్ని అన్ని రాజకీయ పార్టీల నాయకులకు తెలియజేసి, వారి అభిప్రాయాలను విన్న తరువాతనే ముందుకు వెళతామని ఆర్డీఓ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాల్లో మరణించిన వారి ఓట్లు తొలగించాలని, ఇంటి నంబర్లు మార్పులు చేయాలని, ఈ దిశగా బీఎల్‌ఓలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆర్డీఓను కోరారు. సానుకూలంగా స్పందించిన ఆర్డీఓ ప్రస్తుతం బీఎల్‌ఓలు ఇంటింటి పరిశీలన చేస్తున్నారని, ఎలాంటి మార్పులు చేర్పులు అయినా వారిని సంప్రదించి సరిచేసుకోవచ్చని చెప్పారు. సమావేశంలో కాకుమాను తహసీల్దార్ వెంకటస్వామి, పెదనందిపాడు తహసీల్దార్ కుమార్‌బాబు, గుంటూరు వెస్ట్ డీటీ శ్రీనివాసరావు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్లు కె.విజయ్‌కుమార్, మాణిక్యరావు, ఆర్‌ఐ సాహితి పాల్గొన్నారు.

### మానసిక ప్రశాంతతతో ఆరోగ్యం



మాట్లాడుతున్న వైద్యురాలు డాక్టర్ మౌనిక

ప్రత్తిపాడు: వృద్ధాప్యంలో మానసిక ప్రశాంతత ఆరోగ్యాన్నిస్తుందని ప్రత్తిపాడు సీహెచ్‌సీ షుగర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ మౌనికరెడ్డి అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వృద్ధులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వృద్ధాప్యంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్యాధికారులు వివరించారు. డాక్టర్ మౌనిక రెడ్డి మాట్లాడుతూ సహజంగా వయస్సు పెరిగే కొద్దీ వృద్ధుల్లో షుగర్, బీపీ వంటి జబ్బులు వస్తాయన్నారు. ఒత్తిడికి గురవ్వడం, అధికంగా ఆలోచించడం వలన అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మలివయస్సులో ఆనందంగా జీవితాన్ని గడపటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. మత్తు వైద్య నిపుణురాలు డాక్టర్ వర్ష మాట్లాడుతూ వృద్ధులు ఏ చిన్న అనారోగ్య సమస్య బారిన పడినా వెంటనే స్థానిక వైద్యులను సంప్రదించాలన్నారు. వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చికిత్స అందించడం జరుగుతుందని చెప్పారు. ఆస్పత్రి డీడీఓ డాక్టర్ అఖిల్ రత్నం మాట్లాడుతూ వృద్ధుల రక్షణకు భారతదేశంలో అనేక చట్టాలున్నాయన్నారు. వృద్ధుల సంరక్షణ బాధ్యత సమాజంపై ఉందన్నారు. తల్లిదండ్రులను కంటికిరెప్పలా చూసుకుంటే వృద్ధులు ఆస్పత్రుల చుట్టూ తిరిగే పని ఉండదని చెప్పారు.